
ప్రజాశక్తి

ఆదివారం 6 నవంబర్ 2022

5

పార్వతీపురం మన్యం



బోగస్ ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలపై విచారణ



విచారణ చేపడుతున్న ఐటిడిఎ పిఒ నవ్య

సీతంపేట : బోగస్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం పొంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారిపై శనివారం డిసిఎల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ధ్రువపత్రాలు పొందిన వారు విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని అన్నారు. తదుపరి సమావేశానికి టెక్నికల్ తహశీల్దార్ నివేదిక, పురుషోత్తపురం, పెద్దపాలెం పాఠశాల హెచ్ ఎం నివేదికలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ దేశ్, డిప్యూటీ తహశీల్దార్ కుమారి, సీనియర్ అసిస్టెంట్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, గిరిజనసంఘాల నాయకులు

కురుకుట్టి హెచ్‌ఎంపై విచారణ

కలెక్టర్‌కు నివేదిస్తా : ఆర్‌డిఒ
సస్పెండ్ చేయాలని గిరిజన సంఘాల ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావు పాఠశాల బాలికల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన అంశంపై శనివారం పార్వతీపురం ఆర్‌డిఒ హేమలత, డివిఇఒ మంజులవీణ, ఐసిడిఎస్ పిడి వరహాలు విచారణ చేపట్టారు. ఉదయం 12గంటలకు వారు పాఠశాల హెచ్‌ఎం కార్యాలయంలో బాలికలను విచారించారు. ముగ్గురు మహిళా అధికారులతో కూడిన కమిటీ విడతల వారీగా బాలికలను పిలిపించి విచారించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్‌ఎంను విచారించినట్లు తెలుస్తోంది. అధికారపార్టీ అగ్రనేత ఒత్తిడి ఉన్న నేపథ్యంలో విచారణకు రెండు రోజుల ముందే బాలికల చేత ఎలా చెప్పించాలనే ప్రణాళిక సిద్ధం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మంజు ద్వారా బాలికలతో పాత హెచ్‌ఎంకు అనుకూలంగా చెప్పించే ప్రయత్నం చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన విచారణ నివేదిక ఆధారంగా విద్యార్థినులను విచారించి, జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని ఆర్‌డిఒ హేమలత విలేకరులకు తెలిపారు. విచారణ రాత్రి 8గంటల వరకు సాగింది.

హెచ్ ఎంని సస్పెండ్ చేయాలి: గిరిజన సంఘాల ధర్నా

విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎం కృష్ణారావును సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, గిరిజన సంక్షేమ సంఘం, షెడ్యూల్ ఏరియా ఆదివాసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాల గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు డి.చండు మాట్లాడుతూ గిరిజన బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్‌ఎం పై పోక్సో చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరులో బాలికలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల గురించి తమకు చెప్పారని తెలిపారు. దీనికి సంబంధించిన వీడియోలు, లిఖిత పూర్వక ఫిర్యాదులు జిల్లా అధికారులకు అందజేశామన్నారు. 45రోజులుగా అధికారులు జాప్యం చేసి ఇప్పుడు విచారణ చేపట్టడం అన్యాయమని చెప్పారు. హెచ్‌ఎంపై చర్యలు తీసుకోకపోతే ప్రజాసంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.రంజిత్ కుమార్, ఆదివాసీ వికాస్ పరిషత్ అధ్యక్షులు ఎం.నారాయణరావు, కార్యదర్శి ఎస్.జయసింహ, స్థానిక గిరిజన నాయకుడు దొర లక్ష్మణ రావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శ్రీకాకుళం జిల్లా న్యాయమూర్తి గోపి

సమాజంలో మార్పు అవసరం

శ్రీకాకుళం జిల్లా న్యాయమూర్తి గుత్తాల గోపి

ప్రజాశక్తి - సీతంపేట

నేటి సమాజంలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తాల గోపి అన్నారు. శనివారం సీతంపేట ఐటిడిఎలో నిర్వహించిన చట్టాలపై అవగాహన సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి సమాజం పట్ల సామాజిక స్పృహ, బాధ్యత ఉండాలన్నారు. ప్రతి పౌరుడు నాణ్యమైన ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. అప్పుడే నాణ్యమైన జీవితం పొందగలమన్నారు. స్వయం ప్రకటిత క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. జీవితంలో గమ్యాన్ని నిర్దేశించుకొని, ఆ గమ్యాన్ని చేరేందుకు నిబద్ధత, అంకితభావంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రతి వ్యక్తి చట్టానికి లోబడి ఉండాలని, సమాజాన్ని గాడిలో పెట్టడానికి చట్టాలు ఉపయోగపడతాయని అన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, టెక్నాలజీ విషయంలో అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. టెక్నాలజీని అవసరం మేరకు మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. విద్యార్థులంతా మొబైల్ వినియోగానికి వీలైనంత దూరంగా ఉండాలని అన్నారు. చట్టాలను దుర్వినియోగం చేయకూడదని, చట్టాలను ఉపయోగించే విధానాలపై అవగాహన ఉండాలని అన్నారు. మనిషి ఆలోచనల్లో మార్పు రావాలని, సమాజంలో ఇతరులకు ఇబ్బంది కలగకుండా ప్రవర్తించాలని సూచించారు. ఐటిడిఎ పిఒ బి.నవ్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి న్యాయ స్పృహ ఉండాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. స్త్రీలను రక్షించడం అందరి బాధ్యత అని, వారిని గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు, జూనియర్ సివిల్ జడ్జి విజయ్‌రాజ్ కుమార్, పాలకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ, ఐటిడిఎ ఎపిఒ రోసిరెడ్డి, ఎఒ విజయరాణి, ఎడ్యుకేషన్ ఒఎస్‌డి యుగంధర్, ఎంపిడిఒ గీతాంజలి, తహశీల్దార్ నరసింహమూర్తి, ఎపిడి నారాయణ రావు, ఐటిడిఎ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణను అడ్డుకోండి

- రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రధాని పర్యటనలో వివరించండి
- సిఎంకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ

ప్రజాశక్తి -విశాఖపట్నం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని చూస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకుని రాష్ట్ర ప్రయోజనాలకు, ప్రజలకు అండగా నిలవాలని కోరుతూ సిఎం జగన్మోహన్ రెడ్డికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ రాసింది. అందులోని వివరాలను వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ శనివారం మీడియాకు వివరించారు. ఇప్పటికే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఎటువంటి మార్పూ లేదు.. సరికదా ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మి తీరతామని కేంద్ర మంత్రులు పదేపదే ప్రకటిస్తున్నారన్నారు. అలా అమ్మడం సాధ్యం కాని పక్షంలో పరిశ్రమను మూసేస్తామేగానీ నడపబోమని కేంద్ర మంత్రులు పార్లమెంటు సాక్షిగానే ప్రకటన చేసిన విషయాన్ని అజశర్మ గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు వ్యక్తులకు అమ్మినా, మూసివేసినా రాష్ట్ర ప్రయోజనాలకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు తీరని హాని జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని అడ్డుకొని కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా చేయడం రాష్ట్ర ప్రయోజనాల రీత్యా అత్యవసరమన్నారు. ప్రధాని మోడీ ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో అది రాష్ట్ర ప్రభుత్వ అధికార కార్యక్రమంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని అజశర్మ ఉటంకించారు. విశాఖలో జరిగే ప్రధాని సభలో ఆయనతో పాటు తమరూ ఉన్నందున విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ప్రధానిని అడగాలని సిఎంను కోరారు. అదే సందర్భంలో రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేయడం లేదన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగరాజపట్నం పోర్టు, విశాఖ, విజయవాడ మెట్రో రైలు వంటివి సాధ్యం కాదని కేంద్రం చేతులు దులిపేసుకుందన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులను నిలిపివేసిందన్నారు. ఉత్తరాంధ్రలో నిర్మించవలసిన పెట్రో యూనివర్సిటీ ఇంకా నిర్మాణమే ప్రారంభం కాలేదని, గిరిజన యూనివర్సిటీకి స్థల సేకరణ కూడా జరగలేదని తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఇస్తామని ప్రకటన చేశారుగానీ ఇంకా ఆచరణ రూపం దాల్చలేదన్నారు. విశాఖపట్నం రైల్వే డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఏర్పాటు ఉండాలని ప్రధానిని కోరాలన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటంలో భాగంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలనే ఉద్దేశంతో విశాఖలోని కార్మికులు, వివిధ తరగతుల ప్రజానీకం ఈ నెల 9 నుంచి 12 వరకు వివిధ రూపాల్లో నిరసన ప్రదర్శనలు చేయాలని నిర్ణయించారని, ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధం వంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపడితే అది కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వత్తాసు పలకడమే అవుతుందన్నారు.



గర్భిణికి ప్రసవ సపర్యలు చేస్తున్న గిరిజనులు, 108 సిబ్బంది

రోడ్డుపైనే ప్రసవం

గిరిజనులకు తప్పని డోలీ కష్టాలు

ప్రజాశక్తి - కొమరాడ

ఏళ్లు గడుస్తున్నా ఆధునీక యుగంలో ఉన్న తమ గ్రామానికి రోడ్డు సదుపాయం లేక గిరిజనులు నిత్యం అష్టకష్టాలు పడుతున్నారు. గిరిజన కష్టాల మరోసారి తేటతెల్లమైన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. రోడ్డు సదుపాయం లేక పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని మంచంపై డోలి కట్టి మోసుకొని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడం, ఇంతలో వచ్చిన 108 సిబ్బంది సహకారంతో ఆమె రోడ్డుపైనే ప్రసవించి పడంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

మండలంలోని నయా పంచాయతీ వాటకకోసు గ్రామానికి చెందిన ఎం.సరోజినికి శుక్రవారం రాత్రి మూడు గంటల ప్రాంతంలో పురిటి నొప్పి రావడంతో తన భర్త లక్ష్మణరావు 108 వాహనానికి శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో ఫోన్ చేశాడు. అయితే ఆ వాహనం తమ గ్రామానికి రాదని తెలుసుకొని మంచంపై సరోజినిని గ్రామస్తుల సాయంతో మోసుకుంటూ వనకాబడి వరకు మోసుకొస్తున్నారు. వనకాబడి సమీపాన రోడ్డు వద్దకు వచ్చేసరికి నొప్పులు ఎక్కువ అయ్యాయి. అదే సమయంలో 108 వాహన సిబ్బంది శ్రీనివాసరావు (డ్రైవర్), ఈశ్వరరావు (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) రోడ్డుపై పురిటినొప్పులతో బాధపడుతున్న సరోజినికి సపర్యలు చేసి పాప జన్మించేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం 108 వాహనలో పార్వతీపురం కేంద్రాస్పత్రికి సరోజనిని తరలించారు. ఈ సందర్భంగా 108 వాహన సిబ్బందికి గిరిజనులు కృజ్ఞతలు తెలిపారు.

గిరిజన గర్భిణులకు భరోసా లేదా..? సిపిఎం

గిరిజన ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం చాలా అన్యాయమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపైన గిరిజన మహిళ పాపకు జన్మనిచ్చిన విషయంపై సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయిందని మన పాలకులు గొప్పలు చెప్పడం తప్ప ఇప్పటికీ గిరిజన గ్రామాలకు మెరుగైన వైద్యం, రోడ్డు, విద్య సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా పాలకులు ఆలోచించి గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించి, వారి ప్రాణాలను కాపాడాలని కోరారు.

నా కార్యాలయం ముందే చెత్తా?

పట్టణంలో పర్యటించిన సబ్‌కలెక్టర్
నగర పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

పట్టణంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ శనివారం పర్యటించారు. తన కార్యాలయం ఎదురుగా చెత్త ఉండటాన్ని గమనించి ఇక్కడే ఇలా చెత్త ఉంటే ఎలా అని పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యాలాం జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ లోపల పరి సరాలు, ఆటోస్టాండ్, ప్రధాన రహదారి ఇరువైపుల పారిశుధ్యం, మురుగు కాలువలు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్కడికక్కడ పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉండడంతో అసహనం చెందారు. రెండు రోజుల్లో పట్టణ రహదారి పక్కన ఎక్కడా చెత్త కనపించకూడదని మున్సిపల్, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

రోడ్లు త్వరితగతిన పూర్తిచేయాలి....

రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన వేగవంతం చేయాలని సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ అన్నారు. పట్టణంలో పాలకొండ నగర పంచాయతీకి సంబంధించి లుంబూరు సమీపాన గల జగనన్న లేఅవుట్ కాలనీను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికాలరుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్‌లో ఇంటర్నల్ రోడ్లు త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్, హౌసింగ్ సిబ్బంది ఆదేశించారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని, రోడ్లు సదుపాయం కల్పించేలా చూడాలన్నారు.



చెత్తను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్

ప్రజాశక్తి - పాచిపెంట



విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మండల కేంద్రమైన పాచిపెంటలో శనివారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, వంట ప్రదేశం, ఆహార పదార్థాలు, మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరీక్షించారు. కాసేపు తన హోదాను మర్చి ఉపాధ్యాయుడిగా మారారు. చాక్‌పీస్, డస్టర్ తీసుకున్నారు. విద్యార్థుల గణిత, ఆంగ్ల ప్రమాణాలు పరీక్షించారు. తానే స్వయంగా బోర్డుపై రాస్తూ విద్యార్థులను అడిగారు. కొంత మంది విద్యార్థులను పిలిచి బోర్డుపై చిన్న లెక్కలు ఇచ్చి చేయమన్నారు. కొంత విద్యార్థులు తడబడ్డారు. గణిత, ఆంగ్ల బోధనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉండాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ ఉండరాదని ఆయన తెలిపారు.

ప్రభుత్వ భవనాలు వేగవంతం కావాలి

ప్రభుత్వ భవనాలు వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ అన్నారు. మండలంలో పద్మాపురంలో జరుగుతున్న వివిధ భవనాల నిర్మాణాలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం : పిఒ

సీతంపేట : క్రీడలు మానసిక వికాసానికి దోహదపడతాయని ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు. శనివారం ఐటిడిఎలోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాలకొండ నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపికల పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉత్తేజం కలుగుతుందని, ఆటల వల్ల మెదడు చురుగ్గా పని చేస్తుందని, రోజంతా ఉల్లాసంగా ఉంటుందని అన్నారు. క్రీడా ఎంపికలను విజయవంతంగా నిర్వహించాలని పిఇటి సిబ్బందికి సూచించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో ఎంపికలను నిర్వహించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎన్.జాకబ్ దయానందం, జిల్లా స్పోర్ట్స్‌కో ఆర్డినేటర్ ఎం.వాసుదేవ నాయుడు, జిల్లా పిడి, పిఇటిల అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రామకృష్ణ, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ గాంధీ, జిల్లా పిడి, పిఇటిల అసోషియేషన్ సెక్రటరీ మురళి, పీడీలు వెంకటరావు, రమణమూర్తి, రమణ, ఈశ్వరరావు, కళ్యాణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

హెల్త్ అలవెన్స్ రికవరీ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని

పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

హెల్త్ అలవెన్సులను పారిశుధ్య కార్మికుల వేతనాల నుంచి వసూలు చేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి దావాల రమణారావు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పోరాడి సాధించుకున్న ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్‌ను (గత 2022 జనవరి నుండి నేటి వరకు చెల్లించిన దానిని) వారి జీతాల నుంచి వసూలు చేయాలని విజయవాడ–ఇబ్రహీంపట్నంలో గల సిపిఎఫ్ ఎంఎస్ అధికారులు ట్రెజరీ అధికారులకు గతనెల 22న ఆదేశాలు జారీ చేశారు. సబ్ ట్రెజరీ అధికారులు మున్సిపల్ కమిషనర్లకు నోటీసులు ఇస్తున్నారన్నారు. ఇది చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఇటువంటి చర్యలు వెంటనే మానుకోవాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి చింతల సంజీవి, ఉపాధ్యక్షులు చింతల సురేష్, కోశాధికారి పడాల వేణు, కార్యవర్గ సభ్యులు చింతల శ్రీదేవి, పడాల విమల, సిఐటియు మండల కార్యదర్శి కాద రాము పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం చెల్లిస్తున్న హెల్త్ అలవెన్స్ రికవరీ నిర్ణయం వెనక్కి తీసుకోవాలనీ సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.వెంకటరమణ అన్నారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం పట్టణ అధ్యక్షులు సింహాచలం అధ్యక్షతన సుందరయ్య భవనములో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, జనవరి నుండి ఇప్పటి వరకు ఇచ్చిన హెల్త్ అలవెన్స్ రికవరీ చేయాలని, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా అన్యాయం అని దీనిని ప్రభుత్వం ఉపసంహరించికోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ 2019 ఆగస్టు నుంచి కార్మికులకు హెల్త్ అలవెన్స్ చెల్లిస్తుందని 2022 చెల్లించేందుకు ప్రభుత్వం నిరాకరించడంతో జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి బకాయిలతో సహా చెల్లించాలని నిర్ణయం తీసుకొని ఇప్పుడు జనవరి నుంచి రికవరీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడం దారుణమని దీనిని వెంటనే ఉపసంహరించుకొని మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని లేకపోతే భవిష్యత్తులో ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని అన్నారు. సమావేశంలో కార్యదర్శి మల్లేష్, శ్రీను, శివ తదితరు కార్మికులు పాల్గొన్నారు.



పాలకొండలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సాలూరు: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల హెల్త్ అలవెన్సులను రికవరీ చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడానికి నిరసనగా మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు మాట్లాడుతూ 2022 జనవరి నుంచి ఈనెల వరకు మంజూరైన హెల్త్ అలవెన్సులను రికవరీ చేయాలని ఆదేశిస్తూ ప్రభుత్వం సబ్ ట్రెజరీ లకు ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని అన్నారు. దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మేనేజర్ రాఘవాచార్యులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు టి.ఇందు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



సాలూరులో వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఉత్తుత్తి సలహాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మన జిల్లాలో వ్యవసాయ రంగం అత్యంత కీలకమైనది. ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సుమారు 80శాతం కుటుంబాల వారు వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం చూసినా వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో వ్యవసాయ రంగం ఉత్పత్తి, తద్వారా జిల్లాకు వస్తున్న ఆదాయమే అత్యధికం. ఇంతటి కీలకమైన వ్యవసాయ రంగానికి సలహా మండలి అంటే ఎంత పటిష్టంగా ఉండాలి? ఎంతో లోతుగా ఆలోచించడమే కాదు. క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసి రైతులకు అన్ని విధాలా మేలు జరిగే విధంగా ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలి. కానీ, మన జిల్లాలో సాగుతున్న సలహా మండలి సమావేశం ప్రభుత్వానికి సలహాలు ఇచ్చినట్టుగాగానీ, రైతుల ఈతిబాధలను పరిగణనలోకి తీసుకున్నట్టుగా గానీ కనిపించడం లేదు. కష్టమైనా, నష్టమైనా పుడమి తల్లిని నమ్ముకుని అందరికీ అన్నంపెట్టే రైతన్నలకు ఉచిత సలహాలు ఇస్తున్నట్టుగా పనిచేస్తోంది. ఔను.. ఇటీవల ఈనెల 1వ తేదీన జరిగిన సమావేశమే ఇందుకు మచ్చుతునక. ఈ ఏడాది పగడ్బందీగా ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటన చేసింది. ఏటా కొనుగోలు ప్రక్రియలో తలెత్తుతున్న లోపాలను సూక్ష్మంగా చర్చించలేదు. మన జిల్లాలో ధాన్యం తూకంలోను, ధరలోనూ ఏళ్ల తరబడి దగా జరుగుతోంది. దీన్ని ఎలా అధిగమిస్తారన్నది చర్చించలేదు. లక్ష్యానికి అనుగుణంగా, పారదర్శకంగా ధాన్యం సేకరిస్తాం అన్నది పాతడైలాగేనని చాలా మంది చర్చించు కుంటున్నారు. వరి తరువాత స్థాయిలో సాగయ్యే చెరకు రైతులకు సలహా మండలి భరోసా ఇవ్వలేదు. జిల్లాలోవున్న భీమసింగి సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరణ పేరుతో మూసివేసి, ఆ తరువాత తెరవలేమంటూ ప్రభుత్వం చేతులెత్తేసిన విషయం విధితమే. గత ఏడాది లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీని నష్టాలపేరిట మూసివేశారు. దీనివల్ల రైతులకు జరుగుతున్న కష్టనష్టాలను చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన సలహా మండలి సభ్యులు పట్టనట్టుగా వ్యవహరించారు. ఈ ఏడాది టన్ను రూ.3050 మద్దతు ధర ఇస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పెరిగిన ధరల నేపథ్యంలో ఈ ధర ఏమాత్రం సరిపోదని రైతులు, రైతు సంఘం నాయకులు గగ్గోలు పెడుతుండగా రాష్ట్ర ప్రభుత్వం టన్ను ధర రూ.2,700 ప్రకటించింది. వేరుశనగ, గోగు, పత్తి, మొక్కజొన్న ధరలు కూడా అత్తెసరుగానే ఉన్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది గోను సాగు కాస్త పెరిగింది. గత ఏడాది పుట్టీ (బేలు) అంటే సుమారు 3క్వింటాళ్లు రూ.15వేలు చొప్పున ధర పలకగా, ఈ ఏడాది ప్రభుత్వం తరపున కొనుగోలుకు ముందుకు రాలేదు. దీంతో, దళారులు పరిస్థితులను బట్టి రూ.9వేల నుంచి రూ.10వేలకు మించి కొనడం లేదు. వేరు శనగకు ప్రకటించిన రూ.5,850 ధర ఏమాత్రం సరిపోదని వేరుశెనగ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా నిర్ణయించిన ధరలే సరిపోవడం లేదంటే కొనుగోలుకు మీనమేషాలు లెక్కించడం వల్ల దళారుల బారినుండి తప్పించుకోలేని పరిస్థితి మరోవైపు. గతంతో పోలిస్తే విత్తనాలు మొదలుకుని ఎరువులు, పురుగుల మందుల ధరలు పెరిగాయి. సబ్సిడీలు తగ్గాయి. మరోవైపు ఈ ఏడాది వర్షాలు ఎంతో అనుకూలించినప్పటికీ గత నెలలో కురిసిన అకాల వర్షాల వల్ల జిల్లా వ్యాప్తంగా 2223 ఎకరాల్లో వ్యవసాయ పంటలు నాశనమైనట్టు సాక్షాత్తు అధికారిక గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే వ్యవసాయరంగంలో లోటుపాట్లు, రైతుల కష్టనష్టాలు అన్నీ, ఇన్నీ కావు. ఇవన్నీ చర్చించి, తీర్మానాల ద్వారా ప్రభుత్వానికి నివేదించాల్సిన సలహా మండలి సభ్యులు, అధికారులు సుడిదోమలు నివారిస్తాం. పడగ్బందీగా కొనుగోలు చేస్తాం అంటూ ఉచిత సలహాలకు పరిమితమౌతున్నారని రైతులు, రైతు సంఘాల నాయకులు చర్చించుకుంటున్నారు.

పబ్లిక్ టాక్

ఒడిశా పోలీసులకు మస్కా కొట్టి...

పార్వతీపురం టౌన్ : స్థానిక పాత బస్టాండ్ వద్ద యువకుడి నుంచి వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది పట్టణ ఎస్ ఐ ఫక్రుద్దీన్ అందించిన వివరాలిలా ...

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి దగ్గర ఏడిద గ్రామానికి చెందిన రుద్ర శివ ఒడిశాలోని రాయగడ పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న వాహనాన్ని దొంగిలించుకొని పార్వతీపురంలోకి వస్తుండగా స్థానిక పాత బస్టాండ్ ఈ వాహనం నిలిచి ఉండడంతో సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు యువకుడ్ని అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. తాను సంబల్పూర్‌లో పనిచేస్తున్నానని రాయగడ గుడికి వెళ్లగా అక్కడ తనకు రూ.10వేలు నగదు, తన మొబైలు పోవడంతో రాయగడ పోలీసులకు స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేశానన్నారు. అక్కడ తనను పట్టించుకోకపోవడంతో పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న వాహనాన్ని తీసుకువచ్చానని మద్యం మత్తులో సమాధానం చెప్పడంతో అపహరించిన వాహనాన్ని పట్టణ పోలీస్ స్టేషన్ తరలించారు. రాయగడ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ తెలిపారు. ఒడిస్సా పోలీస్ అధికారులు సమాచారం ఇవ్వగా ఒడిస్సా పోలీసులు పట్టణ పోలీస్ స్టేషన్ కు వచ్చి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు .

జగనన్న లేఅవుట్‌లో స్తంభాలు ఏర్పాటు


స్తంభాలు వేస్తున్న సిబ్బంది

సీతానగరం : మండలంలోని అప్పయ్యపేటలో జగనన్న లేఅవుట్‌లో ఎంపిటిసి సభ్యులు బురిడి కుసుమసూరి నారాయణ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీకి విద్యుత్‌తో పాటు మంచినీరు సౌకర్యం, రహదారులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేయిస్తున్న ఎమ్మెల్యే ఎ.జోగారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బి.సూర్యనారాయణ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

9న వ్యవసాయ కార్మికసంఘం జిల్లా మహాసభ

పాచిపెంట : మక్కువ మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం 9వ జిల్లా మహాసభలు ఈనెల 9న జరుపుతున్నామని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకులు ఎం.సీతారాం, ఎస్.సింహాచలం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రకు పాల్పడుతున్నాయని, ఇందుకు వ్యతిరేకంగా సంఘం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఈ మహాసభల్లో జిల్లాలో గల సమస్యలు పరిష్కారం కోసం చర్చించి రానున్న కాలంలో పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కావున ఈ మహాసభలకు వ్యవసాయ కార్మికులంతా పెద్ద ఎత్తున కదిలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు దుప్పాడ లక్ష్మి, బి.పోలీసు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

దిగుబడులను పెంచుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తూ దిగుబడులను పెంచుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ శాఖ ప్రబంధుకులు పి. షణ్ముఖరాజు అన్నారు. గరుగుబిల్లి మండలంలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గ్రామాలైన రావివలస, ఖడ్గవలస, నందివాని వలస, గిజబ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ భూమిని సారవంతం చేసుకోవడానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం కలిగించే ఘన జీవామృతం, ద్రవ జీవామృతం ప్రదర్శనగా తయారుచేసి రైతులకు వివరించారు. రైతులు సాగు చేస్తున్న చిరుధాన్యాలను పరిశీలించారు. గిజబ గ్రామంలో ఎం శివన్నాయుడు నిర్వహిస్తున్న కషాయాలు ద్రావణాల షాపును పరిశీలించి రైతులకు అన్ని రకాలు అందుబాటులో ఉంచాలని కోరారు. ఖడ్గవలస గ్రామంలో గొట్టాపు గుంప స్వామి రైతు యొక్క దేశీ వరి వంగడాలను, అన్నపూర్ణ పంటల నమూనా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంటి రామ గోవింద్, ఎన్‌డిఎలు అన్నపూర్ణ, అప్పలనాయుడు, పోలి నాయుడు రైతులు పాల్గొన్నారు.

మత్తు పానీయాలకు బానిస కావద్దు

మక్కువ : మత్తు పానీయాలకు బానిస కాకుండా ఉండాలని మక్కువ ఎస్ఐ షైడిరాజు గిరిజనులకు పిలుపునిచ్చారు. శనివారం పనసభద్ర పంచాయతీ పరిధిలోని బాగుజోల గ్రామంలో మన ఊరు మన పోలీస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా, గుట్కా ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి గిరిజన బ్రతుకులు దయనీయంగా మారుతున్నాయని అన్నారు. ప్రస్తుత కాలంలో యువత వీటికి దూరంగా ఉంటూ తమ కుటుంబాల బాగు కోసం నడుం బిగించాలని అన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం పోలీస్ శాఖ సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా యువకులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌సి సత్యంనాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

పార్వతీపురంరూరల్ : పార్వతీపురం మండలం, సంగంవలసలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయిన బంగారుజీవరత్నం కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే అలజంగిజోగారావు పరామర్శించారు. బట్టలతో అన్నిపోగొట్టుకున్న వారి స్థితికి జాలితో తన వంతు సహాయంగా అక్కడికక్కడే పదివేలరూపాయలను వారికి ఆర్థికంగా సహాయం అందచేసారు. అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుండి ఆకుటుంబానికి అన్ని విధాల సహాయం అందేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బడేచిట్టినాయుడు, ఉపసర్పంచ్ శ్రీరంజన్, నాయకులు గంటరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

పార్వతీపురంరూరల్ : ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు అందించేందుకే ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలు చేస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బిజగన్నాథరావు అన్నారు. శనివారం మండలంలోని అడ్డాపుశిల గ్రామంలోని ఉపవైద్య కేంద్రంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పాల్గొన్న ఆయన రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు 74రకాల మందులు,14రకాల పరీక్షలు అప్పటికప్పుడు చేసేందుకు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో బందలుప్పి వైద్యాధికారి డా. తిరుమల ప్రసాద్, సర్పంచ్ రామోలుపోలమ్మ, ఎంపిటిసి ఎస్ కృష్ణ, నాయకులు ఆర్‌రామకృష్ణ, అక్కేన సుందరనాయుడు, డిజగదీష్ పాల్గొన్నారు.

నియామకాలను నిలిపివేయాలి

సాలూరు రూరల్ : రెగ్యులర్ సూపర్‌వైజర్ల నియామకంపై కోర్టు తీర్పు వచ్చేవరకు ఇంఛార్జి సూపర్‌వైజర్ పోస్టుల నియామకం నిలిపివేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు శనివారం సాలూరు రూరల్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారినికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ అంగన్వాడీ సూపర్‌వైజర్ నియామకం కోర్టు తీర్పు వచ్చేవరకు ఇన్ఛార్జి సూపర్‌వైజర్ నియామకాన్ని నిలిపివేయాలన్నారు. ఈ విషయంపై కోర్టు తీర్పు వచ్చాక ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి తప్ప ఇలా అంగన్వాడీలపై భారం వెయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహకార దర్శి ఎన్వై నాయుడు, సాలూరు రూరల్ ప్రాజెక్ట్ నాయకులు శశికళ, నారాయణమ్మ, అరుణ, పార్వతి, తిరుపతమ్మ, గౌరి, సుభద్ర, లక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు

కోట సీతారాంపురంలో ఫ్యామిలీ డాక్టర్

సీతానగరం : మండలంలోని కోటసీతారాంపురంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పిహెచ్‌సి వైద్యాధికారి రాధాకాంత్, 104 వైద్యులు వంశీబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచానికే పరిమితమైన వారికి ఇంటికి వెళ్లి వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి, అక్కడి పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వారికి వైద్యం అందజేస్తున్నామన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు, వయో వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారందరికీ ఈ గ్రామంలో వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడే మందులు ఇచ్చి తగు జాగ్రతలు తీసుకోవాలని సూచిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, ప్రసాద్, వెంకటేష్, దివ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన

సీతానగరం : మండలంలోని రంగంపేట, ఆర్.వెంకంపేట సచివాలయాలను ఎంపిడిఒ బి.కృష్ణ మహేష్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ పరిధిలో వచ్చిన సమస్యలను పరిశీలించారు. సిబ్బంది అందుబాటులో ఉండాలని, వచ్చే సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

40 వేల మందికి ఇళ్ల రిజిస్ట్రేషన్

టిట్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్/రూరల్

నెల రోజుల్లో 40 వేల మందికి గృహాలను రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు రాష్ట్ర టిట్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ పరిధిలో నివాస గృహాల్లేని లబ్ధిదారులకు అడ్డాపుశీల వద్ద నిర్మిస్తున్న టిట్కో గృహాలను పర్యవేక్షక ఇంజనీర్ డి.నరసింహమూర్తి, కార్యనిర్వాహక ఇంజనీర్ ఎస్.జ్యోతితో కలిసి శనివారం చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 21 నాటికి 1.50 లక్షల గృహాలను రాష్ట్రంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించి 8,400 ఇళ్లను లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్వతీపురంలో 768 టిట్కో ఇళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 20న పనులు ప్రారంభించామని, ఇప్పటికే 324 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామని ఆయన అన్నారు. రివర్స్ టెండరింగ్ విధానంలో ప్రాజెక్టు గృహాలను రూ.65కోట్లతో నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. 1992 నుంచి 2020 వరకు చేపట్టిన ప్రాజెక్టుల్లో టిట్కో ఇళ్ల ప్రాజెక్టు అతి పెద్ద ప్రాజెక్టు అని ప్రసన్నకుమార్ చెప్పారు. పేదలకు జగన్మోహన్‌రెడ్డి ఈ గృహాలను బహుమతిగా అందించారని పేర్కొన్నారు. 24 గంటలు నీటి సరఫరా ఉండేలా రాష్ట్రంలో అన్ని టిట్కో కాలనీలను తయారు చేస్తున్నామని చెప్పారు. మురుగు నీటిపారుదలకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆయన తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో 300 చదరపు అడుగుల ఇళ్లను ఒక రూపాయికే లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారని, ఆ మేరకు పార్వతీపురంలో 768 ఇళ్లను ఒక రూపాయికే లబ్ధిదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. గృహాల రిజిస్ట్రేషన్ విలువ రూ.50 వేలు ఉందని దాన్ని కూడా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఒక యూనిట్ ఖరీదు రూ.6.50 లక్షలుగా ఉందని, దీంతోపాటు 20 గజాల అవిభాజ్య స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేస్తున్నామన్నారు. వీటి మొత్తం వెరసి రూ.10 లక్షలు ఖరీదు చేస్తుందని వీటిని లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇళ్లకు పుట్టీ, వెట్రిఫైడ్ ఫ్లోరింగ్, వంటగదిలో గ్రానైట్ స్లాబు వేస్తున్నామని ఆయన చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రంలో 32.60 లక్షల ఇళ్లు మంజూరై దేశంలోనే మొదటి స్థానంలో ఉందని చెప్పారు. 17 మున్సిపాల్టీల్లో 50 వేలు ఇళ్లను ఇప్పటికే లబ్ధిదారులకు అందించామని, అందులో 25 వేలు ఇళ్లను రూపాయి విలువకే అందించామని చెప్పారు.


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

తోటపల్లి నుండి నీటి సరఫరా

తోటపల్లి ప్రాజెక్టు నుంచి టిట్కో గృహాలకు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని ప్రసన్నకుమార్ తెలిపారు. ఉల్లిభద్ర వద్ద ఇంటెక్ వెల్‌ను నిర్మించి అక్కడ నుంచి టిట్కో ఇళ్లకు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. నీటి వసతులు కల్పించేందుకు తోటపల్లి వద్ద ప్రసన్నకుమార్ శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఉప కార్యనిర్వక ఇంజనీర్ బాలకృష్ణమూర్తి, సహాయ ఇంజనీర్ ప్రవీణ్, కన్సల్టెంట్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో పిఒ తనిఖీ

ప్రజాశక్తి- సాలూరు

మండలంలోని మామిడిపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలని ఐటిడిఎ పిఒ శ్రీ విష్ణు చరణ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం కార్యాలయంలో హాజరు పట్టికలను ఆయన పరిశీలించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం అనురాధ మాట్లాడుతూ పాఠశాలలో 190 మంది బాలికలు వున్నారని, తరగతి గదులు సరిపడినన్ని లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. భారీ వర్షాలు పడినప్పుడల్లా పాఠశాలకి ముంపు ముప్పు పొంచి వుంటుందని వివరించారు. కొత్త పాఠశాల భవనం నిర్మించి అసంపూర్తిగా వదిలేశారని చెప్పారు. అనంతరం పిఒ విష్ణు చరణ్ వండగది పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి వండుతున్న కూరలను రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన విద్య, వైద్య సేవలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పై దృష్టి పెడతామని చెప్పారు. తాను కొత్తగా విధుల్లో చేరిన కారణంగా ముందు సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


వంటలను రుచి చూస్తున్న పిఒ శ్రీ విష్ణు

నగర పంచాయతీలో గడపగడపకు..

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ రామ కళామందిర్ సచివాలయం పరిధిలో 12వ వార్డు కోమటిపేట తదితర వీధుల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి మాట్లాడుతూ ప్రధానంగా గత మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన అంశాల్లో 95 శాతం అమలు చేసి చూపిందని, అంతేకాక ప్రభుత్వ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంతృప్తి స్థాయిలో అమలు చేసిందన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలతో మమేకమై వారి సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు సూచించారు. నగర పంచాయతీ పరిధిలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయడం జరుగుతుందన్నారు.

ఇంటింటి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారికి వచ్చే పథకాల వివరాలు తెలుసుకున్నారు. వార్డు సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా జవాబుదారీతనంతో పారదర్శకంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పథకాలను చేరవేస్తుండడంతో ప్రజల్లో ప్రభుత్వం పట్ల మరింత విశ్వాసం పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ పథకాల అమలులో మరింత సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ యందవ రాధాకుమారి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పొలంలో శాస్త్రవేత్తల పరిశీలన

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

మండలంలో రుద్రిపేట గ్రామంలో అభ్యుదయ రైతు ప్రసాదరావు పొలంలో చిరు సంచలు ఎంటియు 1282, బాపట్ల చిరు సంచి బీపీటీ 2,858, ఎంటియు 1224 రకాలను ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. తేజేశ్వరరావు, వ్యవసాయ పరిశోధన స్థానం సీతంపేట డాక్టర్ నారాయణస్వామితో పాటు స్థానిక పాలకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు శారద, ఎఒ వాహిని పరిశీలించారు. అనంతరం కొండాపురం పొలాల్లో సంపద వంటి ప్రైవేట్ రకాల్లో, ఎంటియు 1121 రకాలలో సుడిదోమ ఆశించినట్టుగా గమనించారు. సుడిదోమ తక్షణ నివారణ మార్గంగా పొలంలో నీటిని తీసేసి పాయలు చేసి అవసరమైతే డైనో డిఫ్యూరాన్, (ఓషియో, టోకెన్ లాంటివి) లేదా పినాక్సిలం లాంటి మందులు పిచికారి చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. తూటికాయ కాషాయం (10 లీటర్ల ఆవు మూత్రంలో 10 కేజీలు బాగా ముక్కలు చేసిన తూటిక కాయ మొక్కలను పొంగిపొర్లుతున్న మూత్రంలో కలిపినవి) మరిగిస్తూ మంచి మరుగు వచ్చిన తర్వాత నాలుగు సార్లు మరిగిన తర్వాత దాంట్లో తూటికాడ ముక్కలు వేసి తయారైన కషాయంను 15 లీటర్ ట్యాంకు నీటిలో అర లీటర్ చొప్పున వేసి పిచికారి చేసుకుంటే కూడా కోత దశలో ఉండే పంటల్లో దోమ తగ్గే అవకాశం ఉందని తెలియజేశారు. పొలంబడి కార్యక్రమంలో రానున్న రోజుల్లో వర్షాధార రకాల్లో ముఖ్యంగా మధ్యస్థ రకంగా 1210 సుజాత రకం, 150 రోజులు రకంగా ఎంపీలు 1318 వంటి రకాలను వాడుకోవడం మంచిదన్నారు. వీరితో పాటు అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, వ్యవసాయ విద్యార్థులు అపర్ణ, రసజ్ఞ, రైతులు ఉన్నారు.


పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అర్హులకు సక్రమంగా పథకాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైకెపి ఆధ్వర్యంలో అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందేలా సిబ్బంది కృషి చేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ సూచించారు. శనివారం ఆయన స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సకాలంలో అర్హులైన ప్రజలకు అందితేనే ఫలితాలు ఉంటాయన్నారు. స్త్రీనిధి, ఉన్నతి రికవరీ, జగనన్నతోడు, ఎస్‌హెచ్‌జి గ్రేడింగ్, వైఎస్ఆర్ చేయూత, మొబైల్ బుక్ కీపింగ్, సిఐఎఫ్ రికవరీ, విఒ ఆర్ఎఫ్ రికవరీ, హెచ్‌డిఐఎఫ్ రికవరీ, నాడు - నేడు పాఠశాలల పురోగతి, సోషల్ మొబిలైజేషన్, ఆర్ఆర్‌సి షాప్‌ల పనితీరు, విడివిశెల పనితీరు, ఎఫ్‌పిఒ రుణాల రికవరీలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ ఓటర్ నమోదు మొదలగు ప్రభుత్వ కార్యక్రమాలపై క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, వెలుగు సిబ్బందికి అవగాహనపర్చి వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం ఎం.ఆదియ్య, సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల చట్టాలు, బాల వివాహాలు అరికట్టడం గురించి అవగాహన కల్పించారు. విద్యా ర్థులతో ముఖాముఖిగా మాట్లాడి కాసేపు ముచ్చటించారు. అనంతరం సీతంపేట 1,2 సచివాలయాలను సందర్శించారు. సదరు సందర్శనలో పాన్ ఇండియా క్యాంపెయిన్ కార్యక్రమం గురించి వివరించారు. సచివాలయ సిబ్బంది, వాలంటీరు పనితీరు, నాటు సారా, బాల్యవివాహాలు నిర్మూలన గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి, సెక్రటరీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ముచ్చటిస్తున్న జడ్జి సన్యాసినాయుడు

10, 11 తేదీల్లో భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - కలెక్టరేట్

కృష్ణాజిల్లా గుడివాడలో ఈనెల 10 ,11 జరగనున్న భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో భవన నిర్మాణ కార్మికుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు గౌరీశ్వరరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణరంగం సంక్షోభంలో పడిందని, కరోనా కష్టకాలంలో పని లేక తిండి లేక ఎంతో మంది భవన నిర్మాణ కార్మికులు ఆకలి చావులు చనిపోయారని పిల్లలతో పస్తులు ఉన్నారని అన్నారు. అయినా కనీసం జగన్మోహన్‌రెడ్డికి దయకలగలేదని, సంక్షేమ బోర్డులో ఉన్న నిధులు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టమని, పని లేని కాలానికి భృతి చెల్లించాలని భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న 34 రకాల కార్మికులు అభ్యర్థించినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని, వారి సంక్షేమ నిధులు దారి మళ్లించి మోసగించిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో కృష్ణాజిల్లా గుడివాడలో జరుగుతున్న రాష్ట్ర మహాసభల్లో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్తులో భవననిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారానికి మహాసభలో దశ దిశ నిర్ణయించడం జరుగుతుందని కావున మహాసభలు జయప్రదం చేయాలని కొత్తగా ఏర్పడిన మన్యం జిల్లాలో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక, ఇసుక లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కావున భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాయపిల్లి రాము, పైలా సత్యనారాయణ సుబ్బయ్య, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె. గౌరీశ్వరరావు

ఆదేశాలను అమలు చేయాల్సిందే

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఆదేశాలను ప్రతి మున్సిపాలిటీలోనూ పక్కాగా అమలు చేయాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు అన్నారు. శనివారం స్థానిక మున్సిపాలిటీకి వచ్చిన ఆయన కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళి, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారి జి.ఆనంద్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. డంపింగ్‌యార్డ్‌లో పేరుకు పోయిన చెత్త, వ్యర్థాల నిల్వలను పరిశీలించారు. డంపింగ్ యార్డ్ ప్రహరీగోడ ముందు అమలు చేస్తున్న విండ్రో కంపోస్ట్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం బెలగాంలో అన్న క్యాంటీన్ వద్ద జరుగుతున్న చెత్త నుంచి సంపదను సృష్టించే విధానాన్ని, మున్సిపల్ పార్కు లోపల జరుగుతున్న సైట్ కంపోస్ట్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రీజినల్ డైరెక్టర్ మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం ప్రతి మున్సిపాలిటీలో నివాస గృహాల నుంచి వ్యాపార వాణిజ్య సముదాయాల నుంచి ప్రతిరోజు సేకరించిన చెత్తను వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరు చేసి తీసుకోవాలని, నివాస గృహాల్లో ఉన్న తడి చెత్తను హోం కంపోస్టుగా, విజిటబుల్ మార్కెట్, హోటల్, రెస్టారెంట్, కళ్యాణ మండపాల ద్వారా సేకరించిన చెత్తను విండ్రో కంపోస్ట్‌గా, పార్కులు, కార్యాలయాల ఆవరణలో చెట్ల ఆకులు వ్యర్థాలను సైట్ కంపోస్టులుగా తయారు చేసేలా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని, దీని ద్వారా డంపింగ్ యార్డుల్లో చెత్త నిల్వలు పేరుకుపోకుండా ఉంటాయని అన్నారు.

చేప పిల్లలు విడుదల

సాలూరురూరల్ : ఈ ఆర్థిక సంవత్సరం 80ఎంఎం సైజ్ గల 4లక్షల చేప పిల్లలను మండలంలోని అన్నంరాజువలస పరిధిలో గల వెంగళరాయ సాగర్ ప్రాజెక్ట్‌లోకి మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ ఎన్.తిరుపతయ్య, డిప్యూటీ డైరెక్టర్ ఫిషరీస్ విజయనగరం ఎన్.నిర్మల కుమారి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నంరాజువలస పంచా యతీ పరిధిలో గల ఈ ప్రాజెక్ట్ సుమారు 413 మంది గిరిజనులు చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నారని, వీరి జీవన ప్రమాణం పెంపుదలకు ప్రభుత్వం ప్రతి ఏటా విజయన గరం జిల్లాలోని తాటిపూడిలో ప్రభుత్వ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నుంచి నాణ్యమైన 80ఎంఎం సైజ్ గల ఫింగర్లింగ్ 4లక్షల చేప పిల్లలను తీసుకొచ్చి ప్రాజెక్ట్‌లో విడుదల చేశామని తెలిపారు. ఇవి పెరిగేందుకు కొంత సమయం పడుతుందని, కావున మత్స్య కారులు వేటకు కొంత సమయం విరామం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి, మత్స్య కారుల సంఘం అధ్యక్షులు తియ్యాల తిరుపతిరావు, సర్పంచ్ చీమల రాములమ్మ, ఎంపిటిసి అనూష, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, ఇఒపిఆర్‌డి బివిఎస్ ప్రసాద్, ఎఫ్‌డిఒ నాగమణి, విఎఫ్ఎ అప్పన్న, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కురుపాం : అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన గుమ్మ పంచాయతి సర్పంచ్ ఊయక బాలయ్య కుటుంబానికి ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శనివారం ఆయన స్వగ్రామమైన కొనగూడ వెళ్లి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి, ఓదార్చారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. బాలయ్య మృతి వైసిపికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి

వీరఘట్టం : తమకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని అంగన్వాడీ కార్యకర్తలు శనివారం విలేకరుల వద్ద వాపోయారు. గత రెండు నెలలుగా జీతాలందకపోవడంతో కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సక్రమంగా జీతాలు అందక మరిన్ని ఇబ్బందులు పడుతున్నామని, అసలే పండుగ దినాలు కావడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

ప్రజాశక్తి - వీరఘట్టం

రాష్ట్రంలో ఇన్ని ప్రభుత్వాలు మారాయి గాని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ప్రజలకు మనశ్శాంతి లేకుండా పోతుందని రాష్ట్రంలో మూడేళ్ల కాలంలో రాక్షస పాలన కొనసాగుతుందని స్థానిక జనసేన నాయకులు వజ్రగడ రవికుమార్, ఎం.పుండరీకం ఆరోపించారు. శనివారం స్థానిక మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ అధినేత కొణిదల పవన్ కల్యాణ్ గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఇప్పటంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తే పోలీసులు అడ్డగించడం సబవు కాదని విమర్శించారు. ప్రజలకు రక్షక భటులుగా పని చేయాల్సిన పోలీసులు ప్రజల సమస్యల కోసం పోరాడిన నాయకులపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. ప్రతి పౌరుడు తమ స్వేచ్ఛ కోసం పోరాడ హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని గుర్తు చేశారు.

చైల్డ్ ఫండ్ వితరణ

ప్రజాశక్తి - సాలూరురూరల్

సాలూరు, పాచిపెంట మండలాల్లో గత కొన్నేళ్లుగా చైల్డ్ ఫండ్ ఎన్‌జిఒ స్వచ్ఛంద సంస్థ తరపున గ్రామీణ ప్రాంతంలో గల పిల్లలకు అవసరమైన పరికరాలను అంగన్వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తూ పిల్లలకు ఆట వస్తువులు, పుస్తకాలు, బల్లలను అందజేస్తున్న ట్లు ఆ సంస్థ కో ఆర్డినేటర్ అరుణ తెలిపారు. శనివారం మండలంలో సుమారు 8 అంగన్వాడీ కేంద్రాల్లో గల పిల్లలకు ఎబిసిడి బ్లాక్‌లు, కుర్చీలు, ఫ్యాన్లను అందించామని తెలిపారు. ఇటువంటి వస్తువులు ఇవ్వడం వల్ల పిల్లల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగరత్నం, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం: డిఎస్‌పి

సాలూరు: పట్టణ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం డిఎస్పీ ఎం.సుభాష్ కోరారు.శనివారం మన ఊరు -మన పోలీసు కార్యక్రమంలో భాగంగా పెదహరిజనపేటలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. నాటుసారా తయారీ, విక్రయాలలో ప్రమేయం వుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువకులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా వుండాలని సూచించారు. చిన్న చిన్న విషయాలకు అనవసరంగా గొడవలు పడి కేసుల్లో ఇరుక్కోవద్దని కోరారు. దిశ చట్టంపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ సిహెచ్.శ్రీనివాసరావు, ఎస్ఐ పాపారావు పాల్గొన్నారు


మాట్లాడుతున్న డిఎస్‌పి సుబాష్

.11న వాహనాల వేలంపాట

సాలూరురూరల్: సాలూరు, పాచిపెంట మండలాల్లో వివిధ సారా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 11న వేలంపాట వేయనున్నట్లు రూరల్ సిఐ ఎస్.ధనుంజయరావు తెలిపారు. సాలూరు మండలంలో సీజ్ చేసిన 7ద్విచక్రవాహనాలు, ఒక త్రిచక్ర వాహనం, పాచిపెంట మండలంలో పట్టుబడిన 11 ద్విచక్ర వాహనాలు, రెండు త్రిచక్ర వాహనాల వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. సాలూరుఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10గంటలకు వేలం పాట నిర్వహిస్తారని తెలిపారు.ఆసక్తి కలిగిన వారు ఈ వేలంపాట లో పాల్గొనవచ్చునని సిఐ ధనుంజయరావు తెలిపారు.